2007 ఏప్రియల్14వ తేదీ ఉదయం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి తమిళసంవత్సరాది 'విషు' సందేశం

ఓంశ్రీసాయిరాం

ఇంతవరకు భక్తులు చెప్పినట్లుగా మద్రాసుకు త్రాగునీరు యిచ్చాను. పంటలకు కూడా నీరిచ్చాను. కాని, కెనాల్‌ను కేవలం ఆంధ్ర సరిహద్దువరకు మాత్రమే బాగుచేయటం జరిగింది. మద్రాసులో ఉన్న భాగమును మేము ఏమాత్రము ముట్టలేదు. అక్కడి వరకు ఏమాత్రం కష్టము, నష్టము లేకుండా, ఒక్క చుక్క నీరుకూడా యింకిపోకుండా కెనాల్‌ను మంచిగా చేశాము. అక్కడివరకు కృష్ణానది జలము చక్కగా, ఆనందముగా చేరిపోతున్నాదిగానీ, ఆంధ్ర సరిహద్దు దాటిన తరువాత కెనాల్ సరిగా లేకపోవటం వలన నీరు కొంత వృధా అవుతున్నాది. మద్రాసువైపున యింకా 25 కిలోమీటర్ల కెనాల్ రిపేర్ చేయవలసి వుంది. దానికి ముప్పై కోట్లు ఖర్చవుతుంది. ఇది మద్రాసు గవర్నమెంటువారు చేయవలసిన పని. 'ఈ పని యింకా పూర్తి కాలేదే' అన్న అసంతృప్తి ప్రజలను బాధపెడుతున్నది. కనుక, మిగిలిన ఈ 25 కిలోమీటర్ల కెనాల్‌ను కూడా బాగుపరచి మద్రాసుకు నీరు సప్లై చక్కగా జరిగేయట్లు నేను చేస్తాను. మీరు ఎవరిపైనకూడను ఆధాపడనవసరం లేదు. భగవంతుని ప్రార్థించండి. అదే చాలు. అత్యంత త్వరలోనే నేను ఈ పని పూర్తిచేయించి, మద్రాసు ప్రజలకు త్రాగునీరు పూర్తిగా అందునట్లుగా చేయగలను. నేను త్వరలోనే అక్కడికి ఇంజనీర్లను పంపిస్తాను. ఆవేపున కాలువ దెబ్బతిన్నందువల్ల నీరు చాలా వృధా అయిపోతున్నాది. అక్కడనుండి సత్యమూర్తి సాగర్‌కి చేరవలసిన నీరు నిలిచిపోతున్నది. ఇప్పుడు సత్యమూర్తి సాగర్‌కి సత్యసాయి వాటర్ చేరేటట్లు నేను చేస్తాను. మద్రాసు వుండినంతవరకు ఈ వాటర్ పర్మనెంటుగా సరఫరా అవుతుంది. ఎవ్వరూ చేయలేనటువంటి పనిని సాయి చేయగలడు. మిగిలిపోయిన ఆ కాలువకు కూడను చక్కగా, మంచిగా సిమ్మెంటు లైనింగు వేయిస్తాను. మీరు చూశారు, ఇప్పుడు ఎంత నీరు వేస్టు అవుతున్నదో! నీరు ఒకరి సొత్తు కాదు. ఇది భగవంతుని సొత్తు. భగవంతుని ప్రోపరిటీకోసం వీరంతా పోట్లాడటం జరుగుతున్నాది. ఈవిదంగా ఫైట్ చేయటానికి ఎవ్వరికీ అధికారము లేదు. భగవంతుడు ఇచ్చిన ప్రసాదంపై అందరికీ హక్కు వుంది.

ఈ సంవత్సరము సర్వజిత్ నామ సంవత్సరము. 'సర్వజిత్' అనగా ఏమిటి? సమస్తమును జయము గావించేటటువంటిది. వ్యవసాయము, వ్యాపారము, విద్య మొదలైన అన్ని రంగములయందును ఇది జయము చేకూరుస్తుంది. కనుక, మన కార్యముకూడా జయప్రదమౌతాయి. మీరెవ్వరూ ఏవిధమైన ఇబ్బంది పడకుండా నేను చేయగలను. ఎన్ని కోట్లైనా ఖర్చు కానీయండి. పంచభూతముల నందించినవాడు పరమాత్మ. పంచభూతములలో నీరు ఒకటి. అదికూడా భగవంతుని చేతిలోనే వుంటున్నది. కాబట్టి, ఎవ్వరి దగ్గరికీ మీరు పోనక్కరలేదు. ఈ పని తప్పక నేను చేయగలను. ఈవిషయం కరుణానిధికి చెప్పండి. మీ మద్రాసు ప్రజలకు కూడా ఈ శుభవార్త నందించండి. చిన్నచిన్న పిల్లలందరూ ఈ పిచ్చిన నీరు త్రాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటూ వచ్చారు. ఇకమీదట మీరు సుఖంగా, ఆనందంగా ఈ స్వీటెవాటర్‌ను తీసుకొని మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ఈనాడు ఇక్కడికి వచ్చిన మీరందరూ ఎంతో ఆనందంగా తిరిగి వెళ్ళండి. మీకు జీవితంలో ఎట్టి కొరతలు వుండవు. అందరుకూడను నవ్వు మోహాలతో ఆనందంగా జీవించండి. నిరంతరం భగవచ్చింతన చేయండి. అదే మీకు సర్వవిధములైన రక్ష. అట్టి పవిత్రమైన రక్షను పొందినటువంటి ప్రజలు ఎందుకు బాధపడాలి! why fear when I am here! ఈ సర్వజిత్ నామ సంవత్సరములో సత్యమూర్తి సాగర్‌కు నీరందిస్తాను. మీరేమీ యోచన పెట్టుకోకండి. మీ తిండితీర్థాదులనుగాని, ఇంకేవిధమైన కార్యములనుగానీ భగవంతుడే చూచుకుంటాడని విశ్వసించండి.

ఈనాడు పవిత్రమైన సర్వజిత్ నామ సంవత్సరము ప్రారంబమైంది. ఇది మీకు, కేరళవారికి అందరికీ కూడను చాలా ప్రధామైనటువంటిది దినము. కేరళ, మద్రాసు ప్రజలందరికీ నా సంపూర్ణ అనుగ్రహమున్నది. నాకు చెన్నపట్టణముపైన వున్న ప్రేమ వర్ణించటానికి వీలుకానటువంటి ప్రేమ. చెన్నపట్టణమంటే నాకు చాలా ఇష్టము. లేకపోతే, ఎక్కడ పుట్టపర్తి! ఎక్కడ చెన్నపట్టణము! ఎవరు వచ్చి ప్రార్థించారు నన్ను? ఎవ్వరూ రాలేదు. కనుక, మీరందరూ ఆనందంగా, ఆరోగ్యంగా చక్కని నీరు త్రాగి, మంచిగా భోజనము చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.